
# గులాబీ శ్రేణుల్లో జోష్



హుజూరాబాద్‌లో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరిన ఇల్లందకుంట, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్ మండలాల యువకులతో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ విజయ

- బీఆర్‌ఎస్‌లోకి ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలు
- భారీ మెజార్టీయే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పార్టీ శ్రేణులు

హుజూరాబాద్, అక్టోబర్ 17: నియోజకవర్గంలో రోజురోజుకూ బీఆర్‌ఎస్ పటిష్టమవుతుండడం గులాబీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నది. కాంగ్రెస్, బీజేపీల నుంచి చేరికలు జోరుగా సాగుతుండగా, ఎన్నికల్లో భారీ మెజార్టీ లక్ష్యంగా క్యాడర్ ముందుకు సాగుతున్నది. బీజేపీ విధానాలు, నాయకుల తీరు నచ్చక అనేక మంది కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నట్లు తెలుస్తున్నది. తాజాగా సోమవారం ఇల్లందకుంట, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్ మండలాల నుంచి ఈటల రాజేందర్ ముఖ్య అనుచరులు మండలి విప్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడంతో బీజేపీకి కోలుకోలేని దెబ్బతగిలినట్లయింది. ఓ పక్క బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బహిరంగసభ కొనసాగుతుండగానే జరిగిన ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

### గులాబీ దళం.. బలోపేతం

పది రోజుల క్రితం వీణవంక మండలం మామిడాలపల్లి, ఘన్ముక్లకు చెందిన 100ముదిరాజ్, 15మంది ఒడ్డెరసంఘం బీజేపీ నాయకులు, కార్యకర్తలో గులాబీ దళంలో చేరారు. చల్లూరుకు చెందిన నారాయణదాసు గోపీనాథ్ బీజేవైఎం మండలాధ్యక్షుడు సహా పది కార్యకర్తలు ఎంపీపీ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు 30మంది గులాబీ కండువా కప్పుకొన్నారు. ఈటల రాజేందర్ సొంత ఇలాక కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన విశ్వబ్రాహ్మణులు బీఆర్‌ఎస్‌లో చేరడం గమనార్హం. ఏదేమైనా రోజురోజుకూ బీఆర్‌ఎస్‌కు అన్ని వర్గాల నుంచి ఆదరణ పెరుగుతుండడంతో పాడి కౌశిక్ రెడ్డి గెలుపు సునాయాసమయ్యే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా, బీజేపీని వీడిన ఈటల అనుచరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

### ఈటలది ఓర్వలేని గుణం



విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులమై హుజూరాబాద్ నేతగా ఉన్న ఈటల వెంట నడిచాం. ఆయన స్వార్థం కోసం పార్టీ మారినా వెంటే వెళ్లాం. ఈటల గెలుపుకోసం కష్టపడినప్పటికీ తగిన గుర్తింపు లేదు. ఎదుటి వ్యక్తి ఎదిగితే ఓర్వలేని గుణం ఈటలది. అందుకే మర్రి చెట్టు కింద వేరే వృక్షం ఎదగదని గ్రహించి ఆయన పంచన నుంచి బయటికి వచ్చినం. యువ నాయకుడు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి యువతను ప్రోత్సహించే తీరుకు ఆకర్షితులమై ఆయన వెంట నడువాలని బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన.

*- జవ్వాజి కుమారస్వామి, (ఇల్లందకుంట మండలం సిరిసేడు)*

### కార్యకర్తలను పట్టించుకునే వాడు కాదు



అహర్నిశలు పార్టీ కోసం, ఈటల గెలుపు కోసం కష్ట పడ్డ కార్యకర్తలను ఆయన ఏనాడూ పెద్దగా పట్టించుకోలేదు. నేను బీజేవైఎం హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధిగా పార్టీకి సేవలందించా. అయితే ఈటల ఎన్నికల వరకే కార్యకర్తలతో మంచిగా ఉన్నట్లు నటించి ఆ తర్వాత దగ్గరికి కూడా రానిచ్చేవారు కాదు. నా ఎదుగుదలను చూస్తూ ఓర్వలేని నాయకుడి వద్ద ఉండలేకనే పార్టీ వీడి, అందరికీ సమన్యాయం చేస్తున్న బీఆర్‌ఎస్‌లో చేరిన. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తా.

*- మార్క అరవింద్, (వీణవంక మండలం ఎల్బాక)*

### బీజేపీలో మైనార్టీలకు ప్రాధాన్యం లేదు



బీఆర్‌ఎస్ పార్టీ యువ నేత, ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి యూత్, తమ పార్టీ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్న తీరు బాగుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన. బీజేపీలో మైనార్టీలకు తగిన ప్రాధాన్యం లేదు. అలాగే మైనార్టీ నేతలంటే ఆ పార్టీలో, ఈటల చిన్న చూపు చూస్తారు. అందుకే అందులో ఉండలేక అందరికీ సమన్యాయం చేసే బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడడమే లక్ష్యంగా పని చేస్తా.

*- ఎండి జానీ (జమ్మికుంట)*

## నేడు మండలి విప్ కౌశిక్‌రెడ్డి పర్యటన

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 17: హుజురాబాద్ మండలం, పట్టణంలో హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం పర్యటిస్తారని పార్టీ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో వివరాలు వెల్లడించారు. ఉదయం 10:30 గంటలకు హుజూరాబాద్ పట్టణంలోని సిర్సపల్లి క్రాస్‌రోడ్ దగ్గర బీరన్న గుడిని కౌశిక్‌రెడ్డి దర్శించుకుంటారని, 11 గంటలకు స్థానిక సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కందుగుల, 3 గంటలకు చిన్నపాపయ్యపల్లి, 4 గంటలకు పెద్దపాపయ్యపల్లి, 5 గంటలకు కాట్రపల్లి గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం కానున్నారని వెల్లడించారు. సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని 13వ వార్డులో, 7 గంటలకు 16వ వార్డులో, 8 గంటలకు 17వ వార్డులో, 9 గంటలకు 18వ వార్డులో కౌశిక్‌రెడ్డి పర్యటించి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

## హుజూరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే

- బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మూడోసారి సీఎం కేసీఆరే
- బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్17: శాసనసభ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండాయేనని బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీజేపీ నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, ప్రలోభాలకు గురిచేసినా రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆరేనని పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సిటీ సెంటర్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తూ అందరి ఆదరాభిమానాలు చూరగొంటున్నారని గుర్తుచేశారు. అలాంటి గొప్పనాయకుడిని జమ్మికుంట బహిరంగ సభలో ఎమ్మెల్యే ఈటల విమర్శించడం సరికాదన్నారు. కేసీఆర్ దయాదాక్షిణ్యాలతో రాజకీయంగా గుర్తింపు పొంది, ఈరోజు ఆయననే విమర్శిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, గ్రామాల్లో తిరుగనీయకుండా అడ్డుకుంటారని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలకు అనువైన మ్యానిఫెస్టోను ఇటీవల బీఆర్‌ఎస్ విడుదల చేయగా, దానిని జీర్ణించుకోలేక ప్రతిపక్షాల నాయకులు విమర్శించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప స్థానిక ఎమ్మెల్యే ఈటల, ఎంపీ బండి సంజయ్ చేసిందేమీ లేదన్నారు. అందుకే వారికి ఈసారి ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదని జోస్యం చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, సంగెం ఐలయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గూడూరు ప్రతాప్‌రెడ్డి, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, సర్పంచ్ ఎల్లయ్య, నాయకులు కాసర్ల శివారెడ్డి, పోచంపల్లి సదయ్య, ఇజ్జగిరి కుమార్, కాసగోని కిరణ్‌కుమార్, కన్నెబోయిన తిరుపతి, మొలుగూరి ప్రభాకర్, సురుకంటి మాధవరెడ్డి, పంజాల సదానందం, ఒంటెల రాజిరెడ్డి, మండ సతీశ్‌గౌడ్, ఇమ్మడి రమేశ్ పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి

- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- ఇల్లందకుంట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన

ఇల్లందకుంట, అక్టోబర్ 17: 'గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయని ఓ నాయకుడికి ఏడు సార్లు అవకాశం ఇచ్చారు.. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి. భారీగా నిధులు తెచ్చి, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిన్నకోమటిపల్లి, టేకుర్తి, గడ్డివాణిపల్లి, మర్రివాణిపల్లి, సీతంపేట గ్రామాల్లో పర్యటించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. గ్రామాల్లో అర్హులందరికీ గృహలక్ష్మి మంజూరు చేయిస్తానని చెప్పారు. రుణమాఫీకి ప్రభుత్వం రూ.19వేల కోట్లను కేటాయించిందని, లక్ష మాఫీ కాని రైతులకు త్వరలో ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. గ్రామాల్లో మండలి విప్ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిన్నకోమటిపల్లి గ్రామంలో దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయాగణపతి, ఎంపీపీ పావనీవెంకటేశ్, సర్పంచులు రాజిరెడ్డి, వెంకటస్వామి, సరోజన నాగయ్య, వనమాలావాసు, లలిత, ఎంపీటీసీలు ఎక్కటి సంజీవరెడ్డి, ఓదెలు, ఐలయ్య, మాజీ వైస్ ఎంపీపీ చుక్క రంజిత్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ రవి, బీఆర్‌ఎస్ నాయకులు శశి, చందు, వాసు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## అర్థశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



రామ్మోహన్‌రావు

జమ్మికుంట, అక్టోబర్ 17: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడు రామ్మోహన్‌రావుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'వరంగల్ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళల్లో ఉద్యమిత్వం– ఒక పరిశీలన' అంశంపై ఓయూ అర్థశాస్త్ర ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు గానూ ఓయూ నుంచి డాక్టరేట్ అందింది. కళాశాల అధ్యాపకుడు రామ్మోహన్‌రావుకు డాక్టరేట్ రావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, శ్రీలత, సువర్ణ, స్వరూపారాణి, ఈశ్వరయ్య, రవి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, లైబ్రేరియన్ భీమారావు, ప్రశాంత్, సాయి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపారు.


## ప్రధానోపాధ్యాయినికి అబ్దుల్ కలాం అవార్డు



హెచ్‌ఎం.శోభారాణికి అవార్డు ప్రదానం చేస్తున్న వరంగల్ జడ్జి సత్యేంద్ర తదితరులు

వీణవంక, అక్టోబర్ 17: మండలంలోని మామిడాలపల్లి ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా పని చేస్తున్న సుద్దాల శోభారాణి అబ్దుల్ కలాం టీచింగ్ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డును అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని హనుమకొండ నయీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్జి వై సత్యేంద్ర, అవార్డు ఫౌండర్ వెనిశెట్టి రవికుమార్ తదితరులు అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. విద్యారంగంలో ఆమె సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు అవార్డు ఫౌండర్స్ తెలిపారు. హెచ్‌ఎం శోభారాణి అబ్దుల్ కలాం అవార్డు అందుకోవడంపై ఎంఈవో శ్రీనివాస్, పలువురు హెచ్‌ఎంలు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, పీఆర్టీయూ బాధ్యులు కరుణాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా బాధ్యులు బాలాజీ, మాధవస్వామి, రఘు, డీటీఎఫ్ బాధ్యులు మేకమల్ల శ్రీనివాస్, కనకం శ్రీనివాస్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## మాల మహానాడు నూతన గ్రామ కమిటీ



వీణవంకలో గ్రామాధ్యక్షుడు రవీందర్‌తో కమిటీ సభ్యులు

వీణవంక, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం మాల మహానాడు నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గ్రామాధ్యక్షుడిగా వోరె రవీందర్, ఉపాధ్యక్షుడిగా బోగం శ్రీజన్, ప్రధాన కార్యదర్శిగా వోరెం సురేశ్, సంయుక్త కార్యదర్శిగా బోగం సమ్మయ్య, గౌరవ సలహాదారుగా వోరెం సాగర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కడబండ ప్రవీణ్ కుమార్, వోరెం అఖిల్, వోరెం నాగేందర్, కార్యవర్గ సభ్యులుగా వోరెం రామస్వామి, మోహన్, భాస్కర్, సునీల్, రాజు, బోగం అనిల్, వోరెం అక్షిత్, సంతోష్, శాంతికుమార్, అభిలాష్, పూర్ణచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాల మహానాడు సంఘ బలోపేతానికి కృషి చేయాలని కులపెద్దలు సూచించారు.